'నో ఎంట్రీ' పేరిట దోపిడీ

- శ్రీనివాస సేతు నుంచి బస్టాండ్‌లోకి వచ్చే వాహనాలకు అపరాధం
- రోజుకు సుమారు 100 వాహనాలకు జరిమానా
- చూపించేది 10 శాతం కన్నా తక్కువే
- ఒక్కో వాహనం నుంచి రూ.100 నుంచి రూ.200 వసూలు
- ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోని వైనం



తిరుపతి అర్బన్: తిరుపతి నగరంలోని శ్రీనివాస సేతు ఏర్పాటు చేసిన తర్వాత.. వంతెనపై వెళితే ట్రాఫిక్ లేకుండా త్వరగా బస్టాండ్‌కు చేరుకునే అవకాశం ఉందని అంతా భావిస్తారు. దీంతో ద్విచక్ర వాహన దారులతోపాటు నాలుగు చక్రాల వాహనాలు వెళుతున్నాయి. ప్రధానంగా శ్రీనివాస సేతు మీదుగా బస్టాండ్‌లోకి ఆర్టీసీ సర్వీసులు మాత్రమే వెళ్లవచ్చునని, ఇతర వాహనాలు వెళ్లరాదని వంతెన వద్ద చిన్న పాటి బోర్డును ఏర్పాటు చేశారు. ఆ బోర్డులో ఇతర వాహనాలు ఆ మార్గం ద్వారా బస్టాండ్‌లోకి వెళితే రూ.1000 అపరాధం వేస్తామని వెల్లడించారు. అయితే చిన్నపాటి బోర్డు కావడంతో ఆ బోర్డును గుర్తించేవారి సంఖ్య చాల తక్కువే. ఈ క్రమంలో తెలిసీ తెలియకుండా బస్టాండ్‌లోకి అడుగు పెట్టిన వెంటనే ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది నుంచి రూ.100 నుంచి రూ.200 వసూలు చేస్తున్నారు. అయితే వారికి బిల్లు మాత్రం రూ.50 ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా బిల్లు కేవలం 10శాతం మందికి అందిస్తున్నారని 90 శాతం మందికి ఇవ్వడం లేదని చర్చసాగుతోంది. మిగతా మొత్తాన్ని నొక్కేస్తున్నారనే పెద్ద ఎత్తున ఆరోపణలున్నాయి..


నాలుగు చక్రాల వాహనదారుడి నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది


శ్రీనివాస సేతుపై చిన్నదిగా ఏర్పాటు చేసిన నో ఎంట్రీ బోర్డు

బోర్డు వద్దే సిబ్బంది ఉంటే సమస్య లేదు

శ్రీనివాస సేతుపై ఏర్పాటు చేసిన నో ఎంట్రీ బోర్డు వద్దే సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేస్తే... కేవలం ఆర్టీసీ సర్వీసులను మాత్రమే బస్టాండ్‌లోకి పంపి... మిగిలిన వాహనాలకు అవకాశం ఇవ్వకుండా చేయవచ్చు. అలా కాకుండా బస్టాండ్‌లోకి వచ్చిన తర్వాత...అక్కడ సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసి నో ఎంట్రీ పేరుతో జరిమానా వేయడాన్ని అంతా తప్పుపడుతున్నారు.

ఆర్టీసీకి చెడ్డ పేరు తెస్తున్నారు

ఆర్టీసీ అంటే అందరికీ అభిమానం. ఓ నమ్మకం ఉంటుంది. బస్టాండ్‌లోకి పొరబాటున వచ్చినా..నో ఎంట్రీ బోర్డును గుర్తించకుండా వచ్చినా అపరాధం తప్పడంలేదు. అలా చేయడం సరికాదు. నో ఎంట్రీ బోర్డు వద్దనే సిబ్బంది ఉండి వారు సూచనలు చేస్తే బాగుంటుంది. డబ్బులు రూ.100 నుంచి రూ.200 వసూలు చేస్తున్నారు. రసీదు మాత్రం రూ.50కి ఇస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యకు పరిష్కారం

\- ప్రభాకర్, తిరుపతి

రూ.50 మాత్రమే వసూలు చేస్తున్నాం...

నాలుగు చక్రాల వాహదారుల నుంచి రూ.50 మాత్రమే వసూలు చేస్తున్నాం. అదే మొత్తానికి రసీదు ఇస్తున్నాం. అదనంగా వసూలు చేయడం లేదు. నో ఎంట్రీ బోర్డుల వద్ద డ్యూటీలు చేయడానికి మాకు హక్కు లేదు. పోలీసులు చూసుకోవాల్సి ఉంది. బస్టాండ్‌లోకి వచ్చిన వాహనాలకు మాత్రమే జరిమానా వేస్తున్నాం. అదనంగా వసూలు చేస్తే మా వాళ్లపై చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు విచారణ చేస్తాం.

\- చలపతి, సెక్యూరిటీ ఇన్‌చార్జి, తిరుపతి సెంట్రల్ బస్టాండ్

క్లుప్తంగా

కళాశాలకు అంబులెన్స్ అందజేత


అంబులెన్స్ తాళాలు అందిస్తున్న చంద్రశేఖర్

తిరుపతి సిటీ: శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలకు కెనరా బ్యాంక్ అంబులెన్స్‌ను ఉచితంగా అందజేసింది. కళాశాల పూర్వ విద్యార్థి బి.చంద్రశేఖర్ ప్రస్తుతం హైదరాబాద్ సర్కిల్ కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. తన సహ విద్యార్థి, ప్రస్తుత శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర్ రెడ్డి వినతి మేరకు కెనరా బ్యాంక్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా రూ.10 లక్షల విలువైన అధునాతన అంబులెన్స్‌ను మంగళవారం కళాశాల అసోసియేట్ డీన్‌కు అందజేశారు. అనంతరం పూర్వ విద్యార్థి మాట్లాడుతూ తాను చదువుకున్న కళాశాలకు తన వంతు సాయంగా అంబులెన్స్ అందివ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కెనరా బ్యాంక్ సహాయ జనరల్ మేనేజర్ నాగరాజు రావు, విద్యానగర్ బ్రాంచ్ మేనేజర్ సుధీర, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు

నిబంధనల మేరకు ఆర్టీసీ స్థలాల లీజు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ నిబంధనల మేరకు ఖాళీ స్థలాలను 15ఏళ్లపాటు లీజుకు ఇస్తున్నట్లు ఇన్‌చార్జి ఈడీ చెంగల్‌రెడ్డి తెలిపారు. తిరుపతి డీపీటీవో కార్యాలయంలో సూళ్లూరుపేట, వెంకటగిరి, పుత్తూరు డిపోల పరిధిలోని వ్యాపారులతో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే సౌకర్యం ఉందని పేర్కొన్నారు. కడప ఈడీ ఆఫీస్‌లో దరఖాస్తులను సమర్పించాలని, 27వ తేదీన టెండర్లు ఓపెన్ చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి వ్యాపారి ఆర్టీసీ నిబంధనల మేరకు వ్యాపారం చేసుకునే సౌలభ్యం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, డెప్యూటీ ఈఈ చెన్నకేశవరావు, ఏఈ లక్ష్మీనారాయణ, డిపో మేనేజర్లు మల్లికార్జున్, ఎం.ఎస్ ప్రశాంతి, కేవీ శివాజీ పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

పాకాల: విద్యుత్‌ను పొదుపుగా వాడుకుని, భావి తరాలకు ఆదా చేయాలని విద్యుత్ శాఖ డీఈఈ నరేంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం విద్యుత్‌శాఖ వారోత్సవాల్లో భాగంగా దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో విద్యుత్ ఆదాపై వ్యాస, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వ్యక్తులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ పరికరాలను వాడడంతో విద్యుత్‌ను ఆదా చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ జనార్దన్ రావు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీఎం రీజాయినింగ్‌పై విచారణ చేపట్టాలి

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లా దక్కిలి మండలం, ఏపీఎం ఎం.పోలమ్మ అవినీతి ఆరోపణలపై ఈ నెల 11న నెల్లూరు ప్రాజెక్టు వారికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, సరెండర్ ఉత్తర్వులు ఇచ్చిన తిరుపతి డీఆర్‌డీఏ పీడీ వెంటనే పోలమ్మను అదే మండలానికి పోస్టింగ్ ఇచ్చారని, పోలమ్మ రీజాయినింగ్‌పై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాలని ఏపీ ప్రజా సంఘాల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల మునెయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు పోలమ్మ విధి నిర్వహణలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారని, దీనిపై సాక్షాత్తు జిల్లా స్థాయి డీఎంజీ బృందం పరిశీలించి తుది నివేదిక ఇవ్వడంతోనే పోలమ్మను నెల్లూరు ప్రాజెక్టుకు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. అయితే తొలగించిన మండలానికే పోలమ్మకు ఆగమేఘాలపై ఉత్తర్వులు ఎలా ఇచ్చారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు డి.చిరంజీవి, ఎస్‌కే.రఫీ పాల్గొన్నారు.

మహిళా వలంటీర్‌పై దాడికి యత్నం

చంద్రగిరి: మహిళా వలంటీర్‌తో పాటు ఆమె కుటుంబ సభ్యులపై కొంతమంది దాడికి యత్నించిన ఘటన సోమవారం రాత్రి పనపాకం దళితవాడలో చోటుచేసుకుంది. ఈ మేరకు బాధితురాలు మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి వివరాల మేరకు.. పనపాకం దళితవాడకు చెందిన సంగీత, ఆమె భర్త వినోద్‌కుమార్ అదే గ్రామానికి చెందిన గంగులయ్య కుటుంబ సభ్యుల నుంచి నెల క్రితం 24 అంకణాల గ్రామకంఠం భూమిని కొనుగోలు చేశారు. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీన ఇంటి నిర్మాణానికి పునాదులు తీస్తుండగా.. అదే గ్రామానికి చెందిన జ్యోతి పనులను అడ్డుకున్నారు. ఇరువర్గాల వారు పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఆపై సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సంధ్య, ఆమె భర్త వినోద్ తహసీల్దార్ కార్యాలయం నుంచి బయటకు వచ్చే సమయంలో జ్యోతి వర్గీయుల దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితులు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. సోమవారం రాత్రి సంధ్య, ఆమె సోదరి సంగీత ఇంటి వద్దకు జ్యోతి అనుచరులు వామనమూర్తి, లోకేష్, కిషోర్, బుజ్జమ్మ, రెడ్డెమ్మ, నాగరాజ, మాతయ్యతోపాటు మరికొంత మంది వెళ్లి కర్రలు, రాళ్లతో దాడికి యత్నించారు. దీంతో వారు ఇంటికి తాళాలు వేసి డయల్ 100కు సమాచారం అందించారు. అనంతరం బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అడుగులో అడుగు వేస్తూ... అభిమానం చాటుతూ...

- తనపల్లి, కుంట్రపాకంలో చెవిరెడ్డి లక్ష్మి పాదయాత్ర


తనపల్లెలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మి

తిరుపతి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ ఫలాలను వివరిస్తూ...చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేసిన అభివృద్ధిని గుర్తు చేస్తూ.. ఎమ్మెల్యే చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి గడప గడపకు పాదయాత్రను చేపట్టారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం తిరుపతి రూరల్ మండలం తనపల్లి, కుంట్రపాకం పంచాయతీలో ఆమె పాదయాత్రను చేపట్టారు. ప్రతి గ్రామంలోనూ ఆమెకు స్థానికులు అపూర్వ స్వాగతం పలికారు. మంగళ హారతులను పడుతూ ఆత్మీయతను చాటుకున్నారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. సమస్యలకు నిలయంగా ఉన్న పంచాయతీలను కోట్లాది నిధులతో అభివృద్ధి బాట పట్టించిన ఘనత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మోహిత్‌రెడ్డికి దక్కుతుందని స్థానికులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. సమస్య అంటే పరుగెత్తుకుంటూ వచ్చే నాయకుడు మోహిత్ రెడ్డి అని ఆయన వెన్నంటే ఉంటామంటూ ఆయా పంచాయతీల ప్రజలు చెవిరెడ్డి లక్ష్మి ఎదుట తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తన బిడ్డ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని చెవిరెడ్డి లక్ష్మి విజ్ఞప్తి చేశారు. యువకుడు, చదువుకున్న వ్యక్తి, పెద్దల పట్ల గౌరవం కలిగిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ప్రజా జీవితంలోకి వచ్చినందున అతన్ని అక్కున చేర్చుకుని ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తనపల్లి, కుంట్రపాకం సర్పంచ్‌లు సునీత, శుభపద్మనాభరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, పద్మనాభరెడ్డి, ఎంపీటీసీ రెడ్డెయ్య, మల్లంగుంట పీఏసీఎస్ చైర్మన్ హేమాద్రిరెడ్డి, పంచాయతీ అధ్యక్షులు అవినాష్ రెడ్డి, మోహన్‌రెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, చెంచురెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీల అభివృద్ధి చూసి ఓర్వలేని టీడీపీ

- వాస్తవాలను వక్రీకరిస్తూ పచ్చరాతలతో కుట్ర
- ముస్లింలను తాలిబాన్లుగా చిత్రీకరిస్తూ దుష్ప్రచారం
- బాధ్యత వహిస్తూ చంద్రబాబు క్షమాపణ చెప్పాలి
- వైఎస్‌ఆర్‌సీపీ నేతల డిమాండ్


మాట్లాడుతున్న కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఇమామ్ సాహెబ్

తిరుపతి కల్చరల్: బడుగు, బలహీనవర్గాలు, ముస్లింలు రాజకీయంగా ఎదుగుతుంటే చూసి ఓర్వలేక టీడీపీ నేతలు నిరాధారమైన ఆరోపణలతో ముస్లింలపై దాడులకు దిగుతున్నారని వైఎస్‌ఆర్ సీపీ నేతలు ధ్వజమెత్తారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ ఇమామ్ సాహెబ్ మాట్లాడారు. తిరుపతి అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తూ భూమన కుటుంబం అశేష ప్రజాదరణ పొందుతున్నారన్నారు. ప్రజాస్వామ్యంగా భూమన కుటుంబాన్ని ఎదుర్కోలేక వక్రమార్గంలో తప్పుడు ప్రచారాలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. తాను కౌన్సిల్‌లో మాట్లాడిన మాటలను సైతం వక్రీకరిస్తూ పచ్చ రాతలు రాసి టీడీపీ నేతలు ముస్లింలను తాలిబాన్లుగా, ఉగ్రవాదులుగా చిత్రీకరించే దిగజారుడు రాజకీయాలకు దిగడం దుర్మార్గమన్నారు. టీడీపీ సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చించడం మానేసి ముస్లిం యువకుడినైన తన కో-ఆప్షన్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని తీర్మానం చేసిన తీరు దారుణమన్నారు. ముస్లింలపై వారికున్న అక్కసు బహిర్గతమైందన్నారు. కరోనా సమయంలో తిరుపతి నగరంలోని రుయా ఆసుపత్రిలో చనిపోయిన వందలాది మంది శవాలకు బాధ్యతగల పౌరుడిగా సాంప్రదాయబద్ధంగా అంతిమ సంస్కారాలు చేసిన ఘనత తిరుపతి ముస్లింలదన్న విషయం టీడీపీ నేతలు గుర్తించాలన్నారు. ముస్లిం సామాజిక వర్గం భూమన కుటుంబం ఆధ్వర్యంలో రాజకీయంగా ఎదగడం జీర్ణించుకోలేక సోషియల్ మీడియా వేదికగా తనను ముస్లింలను తాలిబాన్లతో పోల్చుతూ ప్రచారం చేయడం అమానుషమన్నారు. టీడీపీ బెదిరింపులకు భూమన కుటుంబం, వారి అనుచరులు బెదరరు, తగ్గరని పచ్చ నేతలు ఒళ్లు తగ్గర పెట్టుకుని వాస్తవాలు మాట్లాడాలని హెచ్చరించారు. ఏపీ నాయీబ్రాహ్మణ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తొండమల్ల పుల్లయ్య, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్, కార్పొరేటర్ నరేంద్రనాథ్, వైఎస్‌ఆర్ సీపీ నేతలు మోహన్‌రాజు, ఖాజీ ఫరీద్, సలీమ్, ఖాజీ, మన్సూర్, గౌస్, గంగామోహన్, వెంకటరమణ, చాంద్‌బాషా, నూరుల్లా, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా విజ్ఞాన ప్రదర్శన


ఉపాధ్యాయుడికి బహుమతి అందిస్తున్న ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్ బాబు

చంద్రగిరి: సౌత్ ఇండియా సైన్స్ ఫేర్ ఎగ్జిబిషన్ మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలతో వ్యక్తిగత ఎగ్జిబిట్స్, సమూహ ఎగ్జిబిట్స్, ఉపాధ్యాయ ఎగ్జిబిట్స్ అనే మూడు విభాగాలలో ఈ సైన్స్‌ఫేర్ నిర్వహించారు. చంద్రగిరి మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల నుండి విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శించిన ఎగ్జిబిట్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓలు లలితకుమారి, భాస్కర్ బాబు, హెచ్‌ఎం విజయ, జిల్లా అకడమిక్ సైన్స్ కోఆర్డినేటర్ కోదండపాణితో పాటు అన్ని పాఠశాలల నుండి సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విజేతలకు ఎంఈఓలు బహుమతులను అందించి అభినందించారు. విజేతలు ఈ నెల 22వ తేదీన శ్రీకాళహస్తి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనలో పాల్గొననున్నారని వారు తెలిపారు.

స్మార్ట్ అభివృద్ధి పనులు మరింత వేగవంతం

తిరుపతి తుడా: స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని తిరుపతి స్మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ హరిత అధికారులను ఆదేశించారు. నగరంలో స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల పనుల పురోగతిపై మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాత మున్సిపల్ కార్పొరేషన్ స్థలంలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ భవన నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు తదితర నిర్మాణాలను అధికారులు నిత్యం పర్యవేక్షించి, త్వరగా పూర్తి చేయాలని అన్నారు. తూకివాకం వద్ద ఏర్పాటు చేసిన సోలార్ ప్రాజెక్ట్‌లో పెండింగ్ పనులు త్వరగా చేయాలని కోరారు. రైల్వేస్టేషన్ పార్సిల్ ఆఫీస్ ఎదురుగా నిర్మిస్తున్న మల్టీలెవల్ కార్ పార్కింగ్ పనులపై కూడా మరింత శ్రద్ధ తీసుకొని పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఎంఈ చంద్రశేఖర్, ఏయికామ్ సంస్థ ప్రతినిధి బాలాజీ, ఏపీఓ రాజశేఖర్, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు పటిష్ట ఏర్పాట్లు

తిరుపతి తుడా: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నెల 26 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను నిర్వహించనున్న నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాల ఏర్పాట్లపై ఇంజనీరింగ్ అధికారులు, పీఈటీలతో మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే రిజిస్ట్రేషన్లు పూర్తి అయ్యాయని, ఈ మేరకు ఆయా సచివాలయం పరిధిలో చేయాల్సిన ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించాలన్నారు. కాంపిటీటివ్ కేటగిరీలో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయని అన్నారు. ఇప్పటికే జిల్లాస్థాయి నుంచి సచివాలయాలకు క్రీడా సామగ్రి చేరిందన్నారు. క్రీడా సామగ్రిని ప్రత్యేక అధికారులకు పర్యవేక్షణలో అందజేయాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్ , వెంకట్రామి రెడ్డి, సూపరింటెండెంట్ రవి, ఎంఈఓ బాలాజీ, డీఈలు, పీఈటీలు పాల్గొన్నారు

శ్రీశక్తిపీఠంలో టీటీడీ చైర్మన్ భూమన


స్వామీజీ, మాతాజీ ఆశీస్సులు తీసుకుంటున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

రామచంద్రాపురం: రాయలచెరువు సమీపంలోని శ్రీశక్తిపీఠాన్ని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పీఠం నిర్వాహకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం పీఠంలో కొలువైన శ్రీవారాహీదేవికి, శ్రీమరకతశక్తి కాళీదేవి, శ్రీకూష్మాండదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలోనే శ్రీశక్తిపీఠం వ్యవస్థాపకులు కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ రమ్యానంద భారతీ ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ పంట


నడింపల్లిలో పర్యటిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తదితరులు

చంద్రగిరి: జగనన్న ప్రభుత్వం అందించిన పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ పంట పండుతోందని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం మండలంలోని ముంగిలిపట్టు, ఐతేపల్లి పంచాయతీల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డిలతో కలసి ఆయన పాల్గొన్నారు. ముందుగా కోదండ రామాపురంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తమ కుటుంబం ఎల్లప్పుడూ ప్రజల్లోనే ఉంటుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తుంటారని వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అఖండ విజయం చేకూర్చాలని కోరారు.

రెండో రోజూ తగ్గని ఆదరణ

తెలుగుదేశం పార్టీకి కాస్త అనుకూలమని చెప్పుకునే ముంగిలిపట్టు పంచాయతీలోని ఎం.కొంగరవారిపల్లి, బోడెంబావి, ఎం.కొత్తపల్లి, మామండూరులో రెండో రోజు కూడా ఎమ్మెల్యే చెవిరెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి అపూర్వ ఆదరణ లభించింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి జనం నుంచి అపూర్వ స్పందన రావడం, సమస్యల పరిష్కారంపై ఎక్కడికక్కడ నిర్ణయాలు తీసుకునే విధంగా అధికారులకు సూచించారు. అనంతరం కనిపించిన వారందరినీ పలకరిస్తూ తన అన్నయ్య చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని విజ్ఞప్తి చేయగా.. తప్పకుండా సాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సాయంత్రం మామండూరు గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచులు భారతి, ఫాజిలా, ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, ఎంపీడీఓ బాలాజీ నాయక్, తహశీల్దార్ శిరీష, ఈఓపీఆర్డీ శశిరేఖ, నాయకులు మట్టా మధుసూదన్ రెడ్డి, దామోదర్ నాయుడు, పరంధామ నాయుడు, మల్లం రాజశేఖర్, మునికృష్ణారెడ్డి, అంజద్‌ఖాన్, కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పసల నాగరాజు, రాజయ్య, పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, నాగభూషణం, గోపాల్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

తిరుపతి కల్చరల్: రానున్న ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం, వీవీ ప్యాట్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తిరుపతి నియోజవర్గం ఓటరు నమోదు అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. ఈ మేరకు ఈవీఎం, వీవీప్యాట్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఈవీఎం ప్రదర్శన వాహనాన్ని మంగళవారం కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి రోజు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అవగాహన కేంద్రం అందుబాటులో ఉంటుందని తెలిపారు. డెప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఆర్వో సేతు మాధవ్, ఈడీటీ జీవన్, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

ఓటు వేయడం, ఈవీఎంలపై అవగాహన


పాకాల: పలు ప్రాంతాల్లోని ప్రజలకు ఓటు వేయడం, ఈవీఎంలపై డీటీ పరదేశి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంగళవారం దామలచెరువు జెడ్పీ హైస్కూల్, ఎంపీపీ పాఠశాల, మొరవపల్లి, మొబ్బినాయనపల్లి, మల్లప్పగారిపల్లి, పంచాయతీ కార్యాలయం ప్రాంతాల్లో ఓటును ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలి, ఈవీఎంలో ఓటును ఏ విధంగా వేయాలన్న విషయాలపై అవగాహన కల్పించారు. ఈవీఎం మిషన్ ఏవిధంగా పని చేస్తుంది, మనం వేసే ఓటు ఏవిధంగా లెక్కించబడుతుందని వివరించారు. ఈవీఎం మిషన్‌లపై ఉన్న అపోహలను వీడాలని, ప్రజలందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు.

రీజనల్ స్థాయి పాలిటెక్నిక్ క్రీడాపోటీలు ప్రారంభం


క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న టీటీడీ అధికారులు

తిరుపతి(అలిపిరి): టీటీడీకి చెందిన తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో రీజనల్ లెవెల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ మంగళవారం ప్రారంభించారు. ఇక్కడ గెలుపొందినవారు జనవరి 4, 5వ తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎస్వీడబ్ల్యూ పాలిటెక్నిక్ విద్యార్థినులు డిస్కస్ త్రోలో మొదటి, రెండో స్థానాలు, షాట్‌పుట్‌లో మూడో స్థానం సాధించారు. వాలీబాల్, చెస్‌లలో విజేతలుగా నిలిచారు. శ్రీవిద్యానికేతన్ కళాశాల విద్యార్థినులు షాట్‌పుట్‌లో గెలుపొందారు. పలమనేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థినులు వాలీబాల్ రన్నర్స్‌గా నిలిచారు. కార్యక్రమంలో ఎస్వీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్, టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం.భాస్కర్ రెడ్డి, ఎస్వీయూ రీజియన్ ఆర్జేడీ నిర్మల్ కుమార్ ప్రియ, కళాశాల ప్రిన్సిపల్ అసుంత, టీటీడీ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, 10 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి విద్యార్థినులు పాల్గొన్నారు.

వైకుంఠద్వార దర్శన కౌంటర్ల తనిఖీ


టోకన్ల జారీ కౌంటర్లను తనిఖీ చేస్తున్న జేఈవో సదాభార్గవి

తిరుపతి(అలిపిరి): తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి తిరుపతిలోని 9 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 90 కౌంటర్లలో సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లు మంజూరు చేస్తామని టీటీడీ జేఈవో సదాభార్గవి తెలిపారు. కౌంటర్లను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం జేఈవో మాట్లాడుతూ తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, గోవిందరాజస్వామి సత్రాలు, భూదేవి కాంప్లెక్స్, రామచంద్ర పుష్కరిణి, ఇందిరామైదానం, జీవకోన హైస్కూల్, బైరాగిపట్టెడలోని రామానాయుడు హైస్కూల్, ఎంఆర్‌పల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కౌంటర్లలో 4 లక్షలకు పైగా సర్వదర్శనం టోకెన్ల కోటా పూర్తయ్యేవరకు మంజూరు చేస్తామని వెల్లడించారు. కౌంటర్ల వద్ద వేచి ఉండే భక్తులకు తాగునీరు, అల్పాహారం, టీ, కాఫీ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టోకెన్లు, టిక్కెట్లు పొందిన భక్తులను 24 గంటల ముందు మాత్రమే తిరుమల శ్రీవారి దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు ముమ్మరం

తిరుమలలో ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వైకుంఠ ఏకాదశి పర్వదినాలను పురస్కరించుకొని టీటీడీ శరవేగంగా ఏర్పాట్లు పూర్తిచేస్తోంది. శ్రీవారి ఆలయంతోపాటు ఆలయ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ దీపాలంకరణకు సర్వం సిద్ధం చేస్తోంది. - తిరుమల


తిరుమలలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్న కార్మికులు

